క్లుప్తంగా

పోషకాహారంపై అవగాహన



పోషకాహారాన్ని ప్రదర్శించి అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గాండ్ల గూడెం పంచాయతీ రెడ్డిగుంపులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాలు అధికంగా ఉండే ఆకు కూరలు, పండ్లు, ఆహారాన్ని ప్రదర్శించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాలు ఉండే ఆహారం, చిరు ధాన్యాలతో ఆరోగ్యంగా ఉండొచ్చని వివరించారు. అదే విధంగా పెరటి తోటలను పెంచుకోవాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో టీచర్లు రాములమ్మ, ప్రమీల, బుల్లెమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

చిరునవ్వుతో ఒత్తిడిపై జయం



ఒత్తిడిని జయించే మార్గాలను వివరిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మీరాహుస్సేన్

మణుగూరురూరల్: స్నేహపూర్వకమైన చిరునవ్వుతో, ఆత్మీయ పలకరింపులతో ఒత్తిడి జయించవచ్చని మణుగూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, జిల్లా ఆంగ్ల రీసోర్స్ పర్సన్ షేక్ మీరాహుస్సేన్ తెలిపారు. లయన్స్ ఇంటర్నేషనల్ మెంటల్ హెల్త్ అండ్ వెల్‌బీయింగ్‌లో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో నాలుగో రోజు మంగళవారం అంబేడ్కర్ సెంటర్‌లో హోటల్, తాపీ వర్కర్లకు, దుకాణదారులకు ఒత్తిడిని జయించడం ఎలా? అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రశాంతతను చేకూర్చే మార్గాలను వివరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మీరాహుస్సేన్ మాట్లాడుతూ.. ఎదుటి వారి బాగోగులు తెలుసుకోవడం, వివిధ సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం, సమస్యలు ఎదురైనప్పుడు సంయమనం పాటించడం వంటి కార్యక్రమాలతో ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. క్లబ్ జోన్ చైర్‌పర్సన్ ముత్తంశెట్టి నాగేశ్వరరావు, కోశాధికారి అడబాల నాగేశ్వరరావు, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా వాల్మీకి జయంతి వేడుక



జయంతి వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ఉద్యోగులు

అశ్వారావుపేట: వాల్మీకి జయంతి వేడుకల్లో అశ్వారావుపేట మున్సిపల్ కమిషనర్ బి.నాగరాజు పాల్గొన్నారు. మంగళవారం స్థానిక తూర్పు బజారులోని వాల్మీకి ఆలయం ఆవరణలో జెండాను ఆవిష్కరించి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కూడా వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో శ్రీను, పాపారావు, వెంకటరమణ, నాగేశ్వరరావు, నాగరాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వితరణ



బియ్యం, నిత్యావసరాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

మణుగూరురూరల్: నిరుపేద విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వ ఉపాధ్యాయులు చేయూతనందించారు. మండలంలోని బండారుగూడెం ఎంపియుపిఎస్‌లో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి పాల్వంచ హితేంద్ర తండ్రి మహేష్ గత నెలలో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దీంతో మృతుడి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంది. విషయం తెలుసుకున్న పాఠశాల హెచ్ఎం బానోత్ సావిత్రి, ఉపాధ్యాయులు మంగళవారం 25కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను వితరణగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి.సరస్వతి, ఎం.రామారావు, ఎం.శారద, బి.పద్మ, జి.శారద తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లు.. వివాదాస్పదం

- ఊరికో విధమైన సమస్యలు..
- నందమూరినగర్‌లో అనర్హులకు కేటాయింపు
- మామిళ్లవారిగూడెంలో నిలిచిన నిర్మాణాలు
- తిరుమలకుంట కాలనీలో మౌలిక వసతుల లేమి



మామిళ్లవారిగూడెంలో పిల్లర్ల దశలోనే నిలిచిన డబుల్ బెడ్రూం ఇళ్లు



వివాదానికి దారితీసిన నందమూరినగర్ డబుల్ ఇళ్లు ఇవే..

అశ్వారావుపేటరూరల్: గత ప్రభుత్వ హయంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం కింద తాజాగా నిర్వహించిన లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లోపించింది. అర్హులైన పేదలకు డబుల్ ఇళ్లు దక్కకుపోగా, కొంతమంది అనర్హులకు జాబితాలో చోటు దక్కిందని పేదలు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే కొద్ది రోజుల క్రితం పేదలు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. ఆందోళన చేపట్టారు.

అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని నందమూరినగర్, మండలంలోని తిరుమలకుంట కాలనీ, పాత మామిళ్లవారిగూడెం గ్రామాల్లో గత ప్రభుత్వం 2018–19లో రూ.3 కోట్ల 60 లక్షల వ్యయంతో 60 డబుల్ ఇళ్ల నిర్మాణాలు ఐటీడీఏ పర్యవేక్షణలో చేపట్టారు. కాగా, నందమూరినగర్, తిరుమలకుంటలో 40 ఇళ్లు నాలుగేళ్ల క్రితమే నిర్మాణాలు పూర్తి కాగా లబ్ధిదారుల ఎంపిక, అప్పగించే ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఈ క్రమంలోనే స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేక చొరవతో ఈ ఏడాది జూలై 24వ తేదీన తిరుమలకుంటలో ఒక లబ్ధిదారునిచే డబుల్ ఇంట్లో గృహప్రవేశం చేయించారు. మిగిలిన 19 మంది లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించగా, కనీస సౌకర్యాలు లేకపోవడంతో మూడు నెలల కావొస్తున్నా నేటికీ లబ్ధిదారులకు అప్పగించలేదు.

నందమూరినగర్‌లో లొల్లి..

తాజాగా దసరా పండుగకు రెండు రోజుల ముందు అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని నందమూరినగర్‌లో నిర్మించిన డబుల్ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక కోసం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సమక్షంలో లక్కీ డ్రా తీశారు. అయితే లక్కీ డ్రా జాబితాలో పెద్ద సంఖ్యలో అనర్హుల పేర్లు నమోదు కాగా, కొద్దిమంది మాత్రమే అర్హులు ఉన్నారు. ఏళ్లుగా పడిగాపులు కాస్తున్న అర్హులైన వారి పేర్లు లేకపోగా.. అధికార పార్టీ నాయకుల అనుచరులకు పెద్దపీట వేశారు. దీంతో పెద్ద సంఖ్యలో పేదలు డబుల్ ఇళ్ల వద్ద ఆందోళన చేపట్టారు. ఆ తర్వాత జాతీయ రహదారిపై ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. దీంతో నందమూరినగర్ ఇళ్ల కేటాయింపు వివాదంగా మారింది.

ఆగిన గృహప్రవేశాలు..

మండలంలోని తిరుమలకుంట కాలనీ గ్రామంలో నాలుగేళ్ల క్రితం నిర్మించిన డబుల్ ఇళ్లకు ఎలాంటి మరమ్మతులు, సౌకర్యాలు కల్పించకుండా లబ్ధిదారులకు కేటాయించడంతో లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేయడం లేదు. ఈ డబుల్ ఇళ్ల కాలనీలో కనీస సౌకర్యాలైన తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సౌకర్యాలు కల్పించలేదు. నిర్మించి నాలుగేళ్లు దాటడంతో కొన్ని ఇళ్లకు సంబంధించిన తలుపులు, కిటికీలు, గుమ్మాలు విరిగిపోయాయి. అలాగే ఫ్లోరింగ్, టైల్స్ ధ్వంసం కాగా, ఇళ్ల పరిసరాలన్నీ పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉన్నాయి. అంతర్గత మార్గాలన్నీ అడవిని తలపిస్తుండగా, అసౌకర్యాలతో ఉన్న ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించి పాలకులు చేతులు దులుపుకున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. ఒక లబ్ధిదారునితో గృహ ప్రవేశం చేయించి మూడు నెలలు దాటినా నేటికి సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించడం పట్ల పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిల్లర్ల దశలోనే ఆగిపోయాయి..

ఇక మండలంలోని మామిళ్లవారిగూడెం పంచాయతీలో డబుల్ ఇళ్ల నిర్మాణాలు పునాది స్థాయి పూర్తై పిల్లర్ల దశలో నిలిచిపోయాయి. గడిచిన ఐదేళ్ల క్రితం ఇక్కడ డబుల్ ఇళ్లకు శ్రీకారం చుట్టారు. ఐటీడీఏ ద్వారా మంజూరైన 20 ఇళ్ల నిర్మాణాలను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించగా, సదరు కాంట్రాక్టర్ పునాది, పిల్లర్లు నిర్మించి బిల్లులు రావడం లేదని ఇళ్ల నిర్మాణాలను అర్ధాంతరంగా నిలిపి వేశారు. ఆ నాటి నుంచి ఇప్పటిదాకా ఈ ఇళ్ల నిర్మాణాల గురించి పట్టించుకునే నాధులే లేకుండా పోయారు. దీంతో ఈ గ్రామ పంచాయతీకి చెందిన లబ్ధిదారులు ఏళ్లుగా డబుల్ ఇళ్ల కోసం పడిగాపులు కాస్తున్నారు.

> **కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు**
>
> రెవెన్యూ అధికారులు ఇచ్చిన జాబితా ప్రకారమే లక్కీ డ్రా తీసి ఇళ్లు కేటాయించాం. గ్రామసభ ద్వారా ఎంపిక చేసి జాబితా అందించాం. డబుల్ ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించే పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. వసతుల కల్పనకు టెండర్లు పిలిచినా స్పందన లేదు. గతంలో చేసిన పనులకు బిల్లుల చెల్లింపులు నిలిచిపోవడంతో ఆసక్తి చూపడం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.
>
> – పి.బాపనయ్య, ఐటీడీఏ డీఈఈ, అశ్వారావుపేట



తిరుమలకుంట కాలనీలో ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలు

కొనసాగుతున్న భూముల సర్వే



రామన్నగూడెంలో సర్వే చేస్తున్న ఉద్యోగుల బృందం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని రామన్నగూడెం రెవిన్యూ పరిధిలోని భూములపై మంగళవారం కూడా జాయింట్ సర్వే నిర్వహించారు. రెండో రోజు సర్వేలో రామన్నగూడెం–నారాయణపురం రెవెన్యూ మధ్య సరిహద్దులను నక్షా ప్రకారం గుర్తించే పనులు నిమగ్నం అయ్యారు. జాయింట్ సర్వే నేపథ్యంలో రామన్నగూడెం గిరిజనులకు ఫారెస్టు, ఎఫ్‌డీసీ మధ్య వివాదం ఉన్న సర్వే నంబర్లు 30, 36, 39లోని హద్దులను సర్వే, నక్షా ప్రకారం గుర్తిస్తున్నామని, మరికొద్ది రోజులు సమయం పడుతుందని స్థానిక తహసీల్దార్ సీహెచ్ రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ మురళి, ఎఫ్‌డీసీ రేంజర్ చంద్రకళ, డిప్యూటీ రేంజర్ రవికుమార్, ఆర్ఐ తాటి కృష్ణ, సర్వేయర్ నాగరాజు, గిరిజనులు మడకం నాగేశ్వరరావు, లక్ష్మణరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

అశ్వాపురం: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు మట్టా వీరభద్రారెడ్డి ఇటీవల బైక్ ప్రమాదంలో కాలు విరిగి గౌతమీనగర్ కాలనీలోని భారజల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు వీరభద్రారెడ్డిని ఆస్పత్రిలో బాధితుడు వీరభద్రారెడ్డిని కలిశారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, కాకా రాములు, సోడె వెంకటేశ్వర్లు, గంగరాజు, కోలా శశికాంత్ పాల్గొన్నారు.

పచ్చనిచెట్లపై గొడ్డలి వేటు



మొదలుకు నరికిన చెట్టు

ములకలపల్లి: పచ్చని చెట్లు గొడ్డలి వేటకు నేలరాలాయి. హరితం కాస్తా హతమైంది. హరిత హారంలో భాగంగా మండలపరిధిలోని కంపగూడెం క్రాస్‌రోడ్డు నుంచి మూకమామిడి అడ్డరోడ్డు వరకూ రోడ్డుకిరువైలా మొక్కలు నాటారు. ఏపుగా పెరిగి చక్కటి చెట్లయ్యాయి. కాగా విద్యుత్ లైన్లకు అడ్డుస్తున్నాయనే కారణంతో ట్రీ కటింగ్‌లో భాగంగా ములకలపల్లి నుండి జగన్నాథపురంలో వెళ్లే దారిలోని కుడివైపు చెట్లను కొన్నింటిని అడ్డగోలుగా నరికేశారు. దీంతో చెట్లు కాస్తా మోడులుగా మారాయి. కేవలం చెట్టు కొమ్మలను తొలగించారని ఉన్నతాధికారులు పదేపదే చెపుతున్నా పెడచెవిన పెట్టి.. నేలమట్టానికి చెట్లు నరకడంపట్ల పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి మొక్కలు నాటడం ఎందుకు? ఇలా నడకడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ నరేష్‌ను వివరణ కోరగా.. పరిశీలిస్తామని, మరోమారు జరుగకుండా చూస్తామని తెలిపారు.

విధులు బహిష్కరించి నిరసన

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై ఓ న్యాయవాది బూటును విసిరేందుకు ప్రయత్నించడాన్ని న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. బార్ కౌన్సిళ్ల ఆధ్వర్యంలో కోర్టుల పరిధిలో న్యాయవాదులు మంగళవారం విధులకు గైర్హాజరై నిరసన వ్యక్తం చేశారు. న్యాయవాది జడ్జిపై దాడికి యత్నించడం ప్రజాస్వామ్యాన్ని, న్యాయ వ్యవస్థను అవమానించడమేనని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.



మణుగూరురూరల్: నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



దమ్మపేట: విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

దమ్మపేట: దమ్మపేట కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారం సతీష్ కుమార్, న్యాయవాదులు ముప్పిడి శ్యామ్‌సుధాకర్, గొంది మురళి మోహన్, సంజయ్, అరుణకుమారి ఉదయ్ కుమార్, బాలరాజు, భవానీకృష్ణ, ఉడతనేని శ్రీనివాసరావు తదితరులున్నారు. కాగా, సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలోనూ ఈ విషయం నిరసన వ్యక్తం చేశారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం ఆధ్వర్యంలో నిరసన చేపట్టగా.. బార్ అసోసియేషన్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మణుగూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేయగా.. అసోసియేషన్ అధ్యక్షుడు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాదులు దాసరి కవిత, మేడరమెట్ల శ్రీనివాసరావు, చిర్రా సరస్వతి, పానుగోటి కిషన్‌రావు, అంకం సర్వేశ్వరరావు, కందిమళ్ల నర్సింహరావు, రామ్మోహన్ రావు, వీరమధుసూధన్, జాడి చొక్కారావు, నగేష్, రమేష్, గద్దల సాంబశివరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: భారత అత్యున్నత న్యాయస్థానం న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడిని యావత్ భారత్ ప్రజలు ముక్త కంఠంతో ఖండించాలని బార్ అసోసియేషన్ సభ్యుడు, బీఆర్ఎస్ పార్టీ లీగల్ అడ్వయిజర్ కొత్త మల్లేశ్వరావు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఉన్నత న్యాయస్థాన న్యామూర్తికే రక్షణ కరువైందని వ్యాఖ్యానించారు.

ఏఐఎస్ఎఫ్ సమావేశం..

అశ్వాపురం: జస్టిస్ గవాయ్‌పై దాడిని ప్రతి పౌరుడు ఖండించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈనపల్లి సాయి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఏఐఎస్ఎఫ్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జస్టిస్ గవాయ్‌పై ఆర్ఎస్ఎస్ ముసుగులో ఉన్న అరాచక న్యాయవాది బూటు విసిరి దాడికి పాల్పడ్డాడన్నారు. ఈ దాడిని పూర్తిగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు చింతల రమేష్, గణేష్, అశోక్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలంటౌన్: విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

11 నుంచి యోగా శిక్షణ శిబిరం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని భద్రాద్రి యోగా ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో శ్రీసీతారామ కమ్మసేవా సమితి సత్రంలో ఈ నెల 11 నుంచి నవంబర్ 9వ తేదీ వరకు యోగా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు శిక్షకుడు నరేష్ గురూజీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు మళ్లీ సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 14 ఏళ్లు నిండి ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ అర్హులని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఎక్స్‌గ్రేషియా మంజూరు

దుమ్ముగూడెం: మండలంలోని గుబ్బలమంగి వాగులో పడి మృతి చెందిన పొనెగంటి వెంకన్న కుటుంబానికి కలెక్టర్ ద్వారా రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరైనట్లు స్థానిక తహసీల్దార్ అశోక్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని చిన్నబండిరేవు గ్రామానికి చెందిన పొనెగంటి వెంకన్న గేదేలను కాస్తు జీవిస్తూ ఉంటాడు. కాగా గత సెప్టెంబర్ నెలలో గేదేలను గుబ్బలమంగి వాగు దాటిస్తుండగా ప్రమాదవశాత్తు వాగులో మునిగి చనిపోయాడు. నిరుపేద కుటుంబం కావడంతో తహసీల్దార్ అశోక్‌కుమార్ చొరవ తీసుకుని బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టారు. మృతుని భార్య అకౌంట్‌లో ఎక్స్‌గ్రేషియా నగదు జమ అవుతుందని తెలిపారు.

డైలీవేజ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

దుమ్ముగూడెం: గిరిజన వసతిని శుభ్రం చేసే డైలీవేజ్ వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదివాసీ నాయకులు కొముురం దామోదర రావు, సోందె మల్లురులు డిమాండ్ చేశారు. మంగళవారం లక్ష్మీనగరం గ్రామంలోని ఆశ్రమ పాఠశాల దగ్గర డైలీవేజ్ వర్కర్లు చేస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని వారు సందర్శించి దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నెల 15 రోజుల నుంచి వారి డిమాండ్లను నెరవేర్చాలని హాస్టల్ వర్కర్లు చేస్తున్న నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. హాస్టల్ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్ర రూపం దాలుస్తామని హెచ్చరించారు.

కుమురం భీం స్ఫూర్తితో ఉద్యమించాలి

కుమురం భీం వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం పలుచోట్ల కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. నిజాం పాలకులకు వ్యతిరేకంగా జల్, జంగిల్, జమీన్ హమారా హై నినాదంతో మిలిటెంట్ పోరాటాలు చేసిన ఘనత భీందేనని అన్నారు. ఆయన స్ఫూర్తితో ఆదివాసీ జాతి కోసం, హక్కుల కోసం పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్



కరకగూడెం: భీం విగ్రహం వద్ద ఆదివాసీ నాయకుల నివాళి..



దమ్మపేట: భీం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జారె, కాంగ్రెస్ నాయకులు



దుమ్ముగూడెం: ములకపాడులో కుమురం భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆర్టీసీ ఆదాయానికి గండి

- **పదుల సంఖ్యలో హైదరాబాద్‌కు ప్రైవేట్ సర్వీసులు**
- ఆ వాహనాలను నిలిపేది ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగానే..
- నిబంధనలు బేఖాతరు.. పట్టింపులేని అధికారులు



ప్రయాణికుల కోసం భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా నిలిపిన ప్రైవేటు బస్సులు

భద్రాచలంఅర్బన్: ములిగే నక్కమీద తాటిపండు పడ్డ చందంగా ఉంది ఆర్టీసీ పరిస్థితి. ప్రస్తుతం అంతంత మాత్రంగా వస్తున్న ఆదాయాన్ని పెంచుకునేందుకు అడుగులు వేసే సమయంలో ప్రైవేటు వాహనాల పుణ్యమా అంటూ భారీగా గండి పడే అవకాశం లేకపోలేదు. ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఆ వాహనాలను అడ్డుకట్ట వేసే దిశగా మాత్రం అధికారులు చర్యలు చేపట్టడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సరిగ్గా సాయంత్రం 8 గంటలు అవ్వగానే భద్రాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా మొత్తం ప్రైవేట్ బస్సుల యజమానులు ఆయా ప్రైవేట్ సంస్థల బస్సులను అక్కడి రోడ్డు మీదే నిలిపి ఉంచుతున్నారు. వీటి గురించి సరిగ్గా ఆరా తీసినవారు లేరు.

నిబంధనలకు నీళ్లు..

మోటారు వాహన చట్టం ప్రకారం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు రెండు కిలోమీటర్లు దూరంలో ఏ ఒక్క ప్రైవేటు వాహనం కూడా నిలుపుదల చేయకూడదు. అలా చేస్తే తగు చర్యలు తీసుకోవచ్చు. అయితే కాంప్లెక్స్ ఇన్‌గేట్ పక్కనే ఆటోలు, ప్రైవేటు బస్సులు నిలుపుదల చేసి ప్రయాణికులను ఎక్కించుకుపోతున్నారు.

ఈ ప్రభావం ఎక్కువగా భద్రాచలం–హైదరాబాద్ రూట్ బస్సులపై పడుతోంది. భద్రాచలం నుంచి రోజూ పదులు సంఖ్యలో ప్రైవేట్ బస్సులు హైదరాబాద్‌కు వెళ్తున్నాయి. అవి కూడా ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట నిలిపి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తున్నాయి.

> **పోలీసులతో చర్చిస్తాం..**
>
> బస్టాండ్ ఎదురుగా రోడ్డు మీద నిలిపే ప్రైవేట్ బస్సులపై భద్రాచలం పోలీస్, ఆర్టీఓ శాఖ పోలీసులతో కలసి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాం. భద్రాచలం నుంచి హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచే విధంగా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిపే ఆర్టీసీని ప్రజలంతా ఆదరించండి. వీలైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తా.
>
> – జంగయ్య, డిపో మేనేజర్, భద్రాచలం